క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



స్టాళ్ల రికార్డులు పరిశీలిస్తున్న యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌ను ఆదివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సందర్శించి తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, రికార్డులు, ఉల్లిపాయలు, టామాటాలు, ధరల పట్టికలను పరిశీలించారు. బోర్డుపై ఉన్న ధరల ప్రకారం వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. సమస్యలేమైనా ఉంటే తన నంబర్ 73311 54978కు కాల్ చేసి తెలియజేయాలని చెప్పారు. ఈవో కొండ బాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

ఎవరి స్టాళ్లలో వారే విక్రయించాలి

సీతంపేట: ఎవరికి కేటాయించిన స్టాళ్లలో వారే కూరగాయలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ అన్నారు. నరసింహనగర్ రైతు బజార్‌లో ఆదివారం ఆయన సమక్షంలో స్టాళ్లకు డ్రా తీశారు. డ్రాలో వచ్చిన నంబర్ల ప్రకారం రైతులు, డ్వాక్రా వ్యాపారులకు వాటిని కేటాయించారు. ఇతరులు స్టాళ్లలో విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు బోర్లు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శంకరరావు

మద్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో రెండు తాగునీటి బోర్లను ఆదివారం ముఖ్య అతిథి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకర రావు ప్రారంభించారు. బర్మా క్యాంప్ డీ–బ్లాక్, కామాక్షినగర్ ప్రాంతాల్లో రూ.1.80 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. వేసవిలో బోర్లు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు రొంగలి చంద్రమౌళి, బొట్ట శంకర్, కె.మున్నా, కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్: స్థానిక మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ పరిసరాల్లో నివసిస్తున్న అంధులైన 12 మంది నిరాశ్రయులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, కోశాధికారి కె.వి.వర్మ, మాధురి, డి.వరప్రసాద్, ఉష, పి.సంతోష్‌కుమార్, టి.సూరిబాబు, బి.వెంకటేశ్వరరావు, కె.భవాని శంకర్, పీఎస్ఎన్ శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్: మురళీనగర్, మద్రిపాలెం సెక్షన్ల పరిధిలో ఫీడర్ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అయ్యప్పనగర్, వర్మ కాంప్లెక్సు కూడలి, సింగరాయిమెట్ట, మసీదు కూడలి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు.. మద్రిపాలెం పార్వతీనగర్, హౌస్సిన్‌నగర్, పంజాబ్ హోటల్ కూడలి, గ్రీన్‌గార్డెన్స్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

జోన్-5 కార్యాలయంలో సమస్యల తిష్ట

- అధ్వానంగా కార్యాలయ పరిసరాలు
- కానరాని మౌలిక సదుపాయాలు
- ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు



సౌకర్యం కేంద్రంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు



ప్రధాన రహదారిలో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



జీవీఎంసీ జోన్-5 ప్రధాన కార్యాలయం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సమస్యలు తిష్ట వేశాయి. ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల పరిధి 25 వార్డులకు చెందిన ప్రజలు ఇక్కడ సేవలు పొందుతున్నారు. వారికి కనీస వసతులు కరువయ్యాయి. కార్యాలయంలో పరిశుభ్రత లోపించింది. పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న అర్జీదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జోనల్ ప్రధాన కార్యాలయ ఆవరణ శుభ్రపరచడానికి స్వీపర్ లేరు. మరుగుదొడ్లు, టాయిలెట్లు శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు.

జోన్–5 కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యూసీడీ, ఎలక్షన్ విభాగం, జనన–మరణాల నమోదు కేంద్రం, జ్ఞానాపురం వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం, విద్యుత్ దీపాల నిర్వహణ కేంద్రం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. రోజూ వందలాది మంది కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా ఇక్కడ లేవు. ఎన్నికల విభాగం, రెవెన్యూ, యూసీడీ విభాగాలకు వెళ్లే మార్గాల పరిసరాలు చెత్తతో నిండి ఉంటున్నాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది రహదారుల్లో తొలగించిన ఫ్లెక్సీలు, దుకాణాలు, బోర్డులను కార్యాలయ పరిసరాల్లో పడేసి వదిలేశారు. ఇక్కడి సౌకర్యం కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి వసతులు లేకపోవడంతో గంటల తరబడి క్యూలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు.

పార్కింగ్ సమస్య..

జోనల్ కార్యాలయానికి పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. ఇక్కడి ప్రధాన రహదారిలో అడ్డదిడ్డంగా కార్లు, ద్విచక్ర వాహనాలు పార్క్‌చేస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది పడుతున్నారు. సమీప రహదారుల్లో వాహనాలు పార్క్‌చేస్తుంటే స్థానికులు గొడవలకు దిగుతున్నారని పలువురు అర్జీదారులు చెబుతున్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

జోన్ ప్రజలకు నిత్యం సేవలందించే అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాన్ని శుభ్రపరుచుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అన్ని విభాగాల్లో క్లాస్ ఫోర్ ఉద్యోగులు ఉన్నా.. కనీసం కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో వెనుకంజవేస్తున్నారు. టాయిలెట్లు ఉన్నా.. తెరుచుకోలేని పరిస్థితి. నిత్యం తాళాలు వేసి ఉంటున్నాయి. జోన్–5 కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై జోనల్ కమిషనర్‌కే ఫిర్యాదులు చేసే పరిస్థితి కనిపిస్తోందని పలువురు చెబుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



సింగరాయిమెట్టలో స్థానికుడికి కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు



51వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మురళీనగర్: నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. ఆదివారం 49వ వార్డులో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 283 సచివాలయం పరిధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఇంటింటా సర్వే చేపట్టారు. సచివాలయ కన్వీనర్ కె.ఢిల్లీరావు, గృహసారథులతో కలిసి అల్లు శంకరరావు సింగరాయిమెట్ట, వైఎస్సార్ రచ్చబండ ప్రాంతాల్లోని 33 కుటుంబాలను కలిసి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. నివాసుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను వారి మొబైల్, ఇంటి తలుపులకు అతికించి, ప్రభుత్వ పాలనా క్యాలండర్‌ను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఐ.రవికుమార్, స్థానిక నాయకులు ఆర్.చంద్రమౌళి, బి.శంకర్, కె.మున్నా, కె.అరుణ పాల్గొన్నారు.

51వ వార్డులో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఆదివారం 291 సచివాలయం కన్వీనర్ కరిమిరెడ్డి శ్యామ్, గృహసారథులతో కలిసి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరును, అభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. వారి అనుమతి మేరకు ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికించారు. వలంటీర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 253 సచివాలయం పరిధి సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ–1, 2 కొండవాలు ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు రాజుయాదవ్, ఎల్.రవిశంకర్, వి.ఎల్లాజిరావు గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, కారుకొండ కనకరాజు, గండి శ్రీరామమూర్తి, సుధాకర్, చంటి, మళ్ల భాస్కర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయినగర్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న కారుకొండ రాజు, కన్వీనర్లు

సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 46వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు శాంతినగర్ సచివాలయం పరిధి కొండవాలు ప్రాంతాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, యువజన విభాగం జోన్ ఇన్‌చార్జి ఎం.సునీల్, వార్డు నాయకులు గోవిందరావు, చిన్నారావు, సోములు, నాయుడు, సీతయ్యరెడ్డి, దుర్గాభవాని, కె.శ్రీను, ఎస్.కె.రామారావు, అప్పలరెడ్డి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు ఆయనకు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కొన్ని అర్జీలను కె.కె.రాజు పరిశీలించి తక్షణం పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం



యూబీఐ జీఎం వరప్రసాద్‌ను సత్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం కె.ఎస్.డి.వి.వరప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఆయన తన సర్వీస్‌లో పని చేసిన విషయాలను గుర్తుచేశారు. ఖాతాదారులకు సేవలందించడంలో సేవాతత్పరత, మానవతా విలువలతో కూడిన నడవడికను ఎప్పటికీ మరువలేనన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, ఎం.ఎస్.భాస్కరరావు, పి.బాపూజీ తదితరులు వైద్య సదుపాయాలు, పెన్షన్ పెంపుదల సమస్యలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి వరప్రసాద్‌ను సంఘ ప్రతినిధులు కె.కోటేశ్వరరావు, టి.కృష్ణారావు, కృష్ణకుమార్, మృత్యుంజయరావు, ఆర్.వి.రవికుమార్ సత్కరించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: విశాఖ జిల్లా కళింగ కోమటి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 14వ వార్డులోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, స్థానిక కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లాడి సురేష్, సెక్రటరీ సూరు చంద్రశేఖర్, కోశాధికారి కింతలి గురుచరణ్, యాక్టివ్ ప్రెసిడెంట్ సకలాభక్తుల సతీష్, ముఖ్య సలహాదారు తాలాసు సాయిమోహన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సీహెచ్ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చాలా మంది రాత్రి పూట మద్యం తాగి గొడవలు సృష్టిస్తున్నారని, అటువంటి వాటిని ఉపేక్షించమన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని చెప్పారు. అనంతరం రౌడీ షీటర్లను పోలీస్ సిబ్బంది దగ్గరుండి ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి కల్యాణం



శ్రీనివాసనగర్‌లో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సీతంపేట: చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో కొలువైన శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. చూడముచ్చటగా తీర్చిదిద్దిన పూల మండపంపై లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణం జరిపించారు. పాంచరాత్ర ఆగమ ప్రవీణుడు ఆరవెల్లి సీతారామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు గోపినంబాళ్ల వేంకట కూర్మాచార్యులు వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. యజ్ఞోపవీత ధారణ, కంకణధారణ, బాసికం, సుమూహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి కల్యాణానికి ముందుగా ఎదురు సన్నాహ ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఉదయం స్వామి వారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విష్వక్సేన పూజా పుణ్యాహవాచనం, రక్షా సూత్రబంధన, అర్చన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీనివాసుడి కల్యాణం తిలకించారు.

నేటి నుంచి పైడిమాంబ ఉత్సవాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు బీఎస్‌బీఎస్ కాలనీలో కొలువైన పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం ప్రధాన పండగ జరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం తిరువీధి మహోత్సవం ఉంటుందని, భక్తులందరూ తరలిరావాలని కోరారు. కమిటీ అధ్యక్షుడు ఎస్.అప్పారావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

ప్రపంచ నటుడు చార్లీ చాప్లిన్



చార్లీ చాప్లిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సినీ ప్రేక్షకుల హృదయాల్లో గూడు కట్టుకున్న చిరంజీవి చార్లీ చాప్లిన్ అని పలువురు వక్తలు కొనియాడారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చార్లీ చాప్లిన్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాప్లిన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయి కళానికేతన్ చైర్మన్ గంటా అప్పలనాయుడు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నవ్వులో ఏడుపును నటిస్తూ.. హాస్య కిరణరసాలను చాప్లిన్ అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశారన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఆకలి చాప్లిన్‌ను నటుడిగా మార్చిందన్నారు. ఆయన గొప్ప మానవతా వాదని పేర్కొన్నారు. అనంతరం 1940లో చాప్లిన్ నటించి దర్శకత్వం వహించిన ది గ్రేట్ డిక్టేటర్ సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో, ఫిల్మ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, బాబ్జి, శివకుమార్, అర్చన, గాయత్రి పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీరుపై మహిళల ఆగ్రహం



సంజీవయ్య కాలనీ-1లో నిరసన తెలుపుతున్న స్థానిక మహిళలు

కంచరపాలెం: స్థానిక గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌పై ఇష్టమొచ్చినట్లు అదనపు రుసుం తీసుకోవడమే కాకుండా నిలదీసి అడిగిన వారిపై దుర్భాషలాడుతున్నారని 46వ వార్డు సంజీవయ్య కాలనీ–1 ప్రాంత మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతానికి భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయన్నారు. స్థానిక నాగేశ్వరరావు గ్యాస్ ఏజెన్సీ నుంచి ఈ గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే సమ్మి నాగేశ్వరరావు(డెలివరీ బాయ్) తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.70 నుంచి సుమారు రూ.250 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నాడన్నారు. ప్రతి ఒక్కరి దగ్గర రూ.1,111 బిల్ అయితే రూ.1,160 నుంచి రూ.1,250కు పైగా అడ్డంగా వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. తమది కొండవాలు ప్రాంతం కావడంతో అడిగిన మేరకు డబ్బులు ఇస్తేనే సిలిండర్ ఇంటికి తీసుకొస్తున్నాడని చెప్పారు. ఈ విషయంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ వ్యవహారశైలి మారడం లేదని వాపోయారు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీరుపై సంబంధిత అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్తామని సంజీవయ్య కాలనీ–1 మహిళలు తెలిపారు.

బెంగాలీల కృషి అమోఘం



బెంగాలీ న్యూ ఇయర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తాటిచెట్లపాలెం: విభిన్న సంస్కృతులకు నిలయమైన విశాఖ నగరాన్ని సంప్రదాయంగా, ఆర్థికంగా పరిపుష్టం చేయడంలో బెంగాలీలు చేస్తున్న కృషి అమోఘమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కొనియాడారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని వాల్తేర్ కాళీ బారి టెంపుల్‌లో ఆదివారం నగరంలోని బెంగాలీలు సుభోనబ బర్షా 1430 పేరిట బెంగాలీ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా నగరంలో నివసిస్తున్న బెంగాలీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరానికి గానూ కాళీ బారి కమిటీ తరఫున విశేష సేవలందించిన ఎం.రవీంద్ర పట్నాయక్, చింతామణి రాయ్, ఎ.బి.భట్టాచార్జి, రంజిత్ చందా, అశోక్‌పాల్, కె.పి.రాయ్, కె.సి.దాస్, ఆర్.పి.సాహ, ఎ.సి.దాస్, ఆర్.ఎస్.ఖాన్, ఎస్.కె.చటర్జీలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాల్తేర్ కాళీ బారి నిర్వాహక సంఘం సాంస్కృతిక కార్యదర్శి ప్రాణతిక్ ముఖర్జీ, జోయ్‌దేవ్ చక్రవర్తి, ప్రహ్లాద్ మజుందార్, కాళీ బారి ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఒక ప్రేమికుడు.. ఒక భావుకుడు' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

సీతంపేట: రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు రచించిన 'ఒక ప్రేమికుడు.. ఒక భావుకుడు' గ్రంథావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రామారావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి రచయిత, విమర్శకుడు డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆచార్య ప్రయాగ సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని సమీక్షించారు. డాక్టర్ రాచకొండ నరసింహశర్మ జీవిత చరిత్ర, జీవనయానాన్ని చాలా ప్రతిభావంతంగా గ్రంథస్తం చేశారని రచయిత సూర్యారావును కొనియాడారు. రాచకొండతో తన అనుభవాలను సూర్యారావు సభికులకు వివరించారు. రావిశాస్త్రి తమ్ముడిగా సుపరిచితుడైన నరసింహశర్మ అమెరికాలో 1968 నుంచి 2005 వరకు వైద్యుడిగా సేవలందించి, 2005లో విశాఖలో స్థిరపడ్డారని, ప్రస్తుతం ఆయన వయసు 99 ఏళ్లని చెప్పారు. నరసింహశర్మ వైద్యుడిగా, సాహితీవేత్తగా చేసిన సేవ, కృషి, కుటుంబ సభ్యుల జీవిత చరిత్రను పుస్తకంలో పొందుపర్చానన్నారు. అనంతరం నరసింహశర్మ తన అనుభవాలను తెలియజేశారు.